క్లుప్తంగా

జాతీయ సదస్సుకు జగదీష్‌రెడ్డికి ఆహ్వానం

బంగారుపాళెం: జాతీయ సదస్సుకు మండలంలోని దండువారిపల్లెకు చెందిన ఆదర్శ రైతు జగదీష్‌రెడ్డికి ఆహ్వానం అందినట్లు శనివారం తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని జేఎన్‌కేవీవీ జబల్‌పూర్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి 30 వతేదీ వరకు ×తదుపరి తరం వ్యవసాయం–సేంద్రీయ, సహజ వ్యవసాయం× అనే సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో పాల్గొని సహజ వ్యవసాయ సాగుపద్ధతులపై సందేశం ఇవ్వాలని ఆహ్వానించినట్లు జగదీష్‌రెడ్డి చెప్పారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : నోబుల్ టీచర్స్ అసోషియేషన్ రూపొందించిన డైరీని డీఈఓ విజయేంద్రరావు ఆవిష్కరించారు. డీఈఓ కార్యాలయంలో శనివారం ఆ సంఘం నాయకులు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆ సంఘం నాయకులు డీఈఓతో మాట్లాడుతూ టీచర్ల పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్‌లీవుల బకాయిల చెల్లింపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి రామయ్య, అసోసియేషన్ సభ్యులు రవి, భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్, మునీంద్ర, వరదరాజులు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గోపి మృతి బాధాకరం



గోపి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: వైఎస్సార్‌సీపీ నాయకుడు, వెప్పాలమానుచేను గ్రామానికి చెందిన గోపి(45) మృతి చెందడం చాలా బాధాకరమని చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. శనివారం తెల్లవారుజామున గోపి క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి విజయానందరెడ్డి పూలమాల వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీకి ఎనలేని సేవలు చేశారని ఆయన కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందన్నారు. ఆయనతో పాటు ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, సర్పంచులు మధుసూదన్‌రాయల్, మధుసూదన్‌రెడ్డి, గోపి, చిట్టిబాబు, రమేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కారిమేఘన్, శింభు, యోవాన్, రమణ, కృష్ణమూర్తి, సెల్వం, కృష్ణారెడ్డి, భానుమూర్తిరెడ్డి సంతాపం తెలియజేశారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో శనివారం రాయలసీమ ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీలో కొత్త మెలకువలను అందుబాటులో తీసుకొచ్చేందుకు ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. తిరుపతి తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, కార్యదర్శి అమరనాథ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి ఫొటోగ్రాఫర్లకు అందుబాటులో స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాయలసీమ ఫొటోగ్రాఫర్స్ సౌకర్యార్థం నూతన ప్రొడక్ట్ స్టాల్స్, ఈ ఎగ్జిబిషన్‌ను రెండు రోజులు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌లో నిర్వహించిన ఫ్యాషన్‌లో ర్యాంపుపై యువతులు క్యాట్‌వాక్ చేస్తూ అలరించారు. కార్యక్రమంలో ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ పాల్గొన్నారు.

16న రథసప్తమి వేడుకలు

తిరుపతి(అలిపిరి): వచ్చే నెల 16వ తేదీన తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. రథసప్తమి పర్వదినం సందర్భంగా అమ్మవారు ఏడు వాహనాలపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7.15 నుంచి 8.15 గంటల వరకు సూర్యప్రభ వాహనం, 8.45 నుంచి 9.45 గంటల వరకు హంస వాహనం, ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు అశ్వ వాహనం, ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు గరుడ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించనున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు చిన్నశేష వాహనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు గజ వాహనంపై దర్శనమిస్తారన్నారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు శ్రీకృష్ణస్వామివారి ముఖ మండపంలో అమ్మవారి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే లక్ష్మీపూజ, ఆర్జిత కల్యాణోత్సవం, కుంకుమార్చన, బ్రేక్ దర్శనం, ఊంజల సేవ, సహస్రదీప అలంకార సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం పక్కన ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుదాం

- జగనన్న పిలుపుతో ఆరంభిద్దాం
- విజయమే అంతిమ లక్ష్యం
- నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్



సిద్ధం కరపత్రాలతో డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు

పూతలపట్టు(యాదమరి): ఎన్నికల యుద్ధానికి అందరం సిద్ధమవుదామని భీమిలి నుంచి జగనన్న ఇచ్చిన పిలుపును అందుకుని, మనం సైతం సిద్ధం అవుదాం అని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్న శాసనసభ ఎన్నికలకు శంఖారావం పూరించారని మనం సైతం నియోజకవర్గంలో అందరం ఐకమత్యంగా కలిసిమెలసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని కోరారు. జగనన్న పిలుపుతో యుద్ధం ఆరంభించి విజయమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగుదామని చెప్పారు. రానున్న 75 రోజుల్లో ఎన్నికలు జరగనున్నట్లు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారని పేర్కొన్నారు. దీనిపై ఈ రోజు నుంచి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అందరం కలిసిమెలిసి ప్రతి ఇంటికీ వెళదామన్నారు. జగనన్న రాష్ట్రంలోని ప్రజలకు పార్టీలకు అతీతంగా కులమత బేధాలు చూడకుండా నవరత్నాలను ప్రతి లబ్ధిదారునికి అందించారన్నారు. ఈ ఎన్నికలలో ముఖ్యమైన ప్రచారం నవరత్నాలే అని సూచించారు. ఇకపై ప్రతి ఒక్కరితోనూ నడిచి వస్తానని అందరం ప్రతి ఇంటిలోని ప్రతి గడపకు వెళ్లి వివరించి రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా చూడాలని కోరారు.

అయోమయంలో టీడీపీ, జనసేన

ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఏమి చేయాలో అర్థంగాక టీడీపీ జనసేన పార్టీలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాయని డాక్టర్ సునీల్‌కుమార్ విమర్శించారు. ఉనికి కోసం టీడీపీ నాయకులు తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అంతేకానీ ఇప్పటివరకు ఎన్నికలలో ప్రజలకు ఎలాంటి పథకాలు అందిస్తారో చెప్పలేకపోతున్నారన్నారు. టీడీపీ నిర్వహిస్తున్న గ్యారంటీ సభల్లో ఏం చేస్తారో వివరంగా చెప్పడం లేదని గుర్తుచేశారు. ఇదంతా చూస్తుంటే చంద్రబాబు ఊసరవెల్లిలా రంగులు మార్చి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ జగనన్నను నమ్ముకున్నారని ఆయన ఎలాంటి పరిస్థితుల్లో మాట తప్పకుండా మడమ తిప్పకుండా పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు



పురస్కారం అందుకున్న ఓంకార్‌రావు



ఉషారాణి



రమాదేవి

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు గణతంత్ర దినోత్సవం రోజున పోలీసు పరేడ్ మైదానంలో పలువురు అధికారులు, ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. అందులో జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ ఉషారాణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయ సూపరింటెండెంట్ రమాదేవికి కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి చేతులమీదుగా పురస్కారాలు అందుకున్నారు.

ప్రతినెలా తప్పకుండా చికిత్స చేసుకోవాలి



ద్వారకాపురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక



రోగులకు సేవలందిస్తున్న వైద్యులు



బంగారుపాళెం: సంక్రాంతిపల్లెలో..

యాదమరి: మండలంలో ఉన్న గర్భవతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా క్రమం తప్పకుండా చికిత్సలు చేసుకోవాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని బుడితిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రోగులకు, గర్భవతులకు 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించి, 107 రకాల మందులను అవసరమైన రోగులకు అందించారు. అనంతరం గ్రామీణ ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగులకు ఉచితంగా చికిత్సలు చేసి అన్ని వ్యాధులకు మందులు అందిస్తున్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చక్కెర వ్యాధి రక్తపోటు గలవారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్య సేవలు

తవణంపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు అందుబాటులో వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ద్వారకాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో 250 మందికి వైద్య పరీక్షలు

బంగారుపాళెం: మండలంలోని సంక్రాంతిపల్లెలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ తెలిపారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్లు శిరీష, శాలిని ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, కంటి పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణులకు ప్రభుత్వం గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చను ఆదరించండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 29న జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని చూపించేలా ఏర్పాట్లు చేసి, ఆదరించాలని బీజేపీ నాయకులు కొల్లా చిట్టిబాబు డీఈఓను కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం డీఈఓ విజయేంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన డీఈఓతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాదిలో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని ఢిల్లీ నుంచి ప్రత్యక్ష ప్రసారంలో విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులతో మాట్లాడతారని చెప్పారు. దీన్ని జిల్లాలోని సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు వీక్షించేలా చర్యలు చేపట్టాలని డీఈఓకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, రామభద్ర, రెడ్డి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ జంటకు రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న ప్రేమ జంట

చిత్తూరు రూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, తమకు రక్షణ కల్పించాలని గుడిపాల మండలం వసంతాపురం పంచాయతీ చెరువు ముందర ఊరుకు చెందిన ప్రేమ జంట కాంచన, భరత్ కుమార్ శనివారం చిత్తూరు నగరంలోని ప్రెస్ క్లబ్‌ను ఆశ్రయించారు. తాము గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నామని చెప్పారు. అయితే తమ ఇద్దరి కులాలు వేరు కావడంతో యువతి తల్లిదండ్రులు, బంధువులు, పెద్దలు వివాహానికి అంగీకరించలేదన్నారు. దీంతో తాము ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నామని చెప్పారు. ఇది తెలుసుకున్న యువతి కుటుంబసభ్యుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని చెప్పారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళతాం



కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలనలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయవాదుల సంఘం సభ్యుల సమస్యలను హైకోర్టు కమిటీ దృష్టికి తీసుకెళతామని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ రావు రాఘనందన రావు పేర్కొన్నారు. ఆయన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్‌తో కలిసి శనివారం నగరంలోని న్యాయవాదుల సంఘ భవనాన్ని సందర్శించారు. చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రాజేంద్ర రెడ్డి, కార్యదర్శి అశోక్ యాదవ్, న్యాయవాదుల క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు నల్లారి ద్వారకనాథ్ రెడ్డితో సంఘం సభ్యులు హైకోర్టు జడ్జిని ఘనంగా సన్మానించారు. న్యాయవాదుల సంఘం సభ్యుల సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆయనకు అందజేశారు. నూతన జిల్లా కోర్టు నిర్మాణ పనులు, రికార్డులను పరిశీలించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రోడ్డు భద్రతా నియమాలు పాటించి వాహనదారులు సురక్షిత ప్రయాణం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలో శనివారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని 500 మంది విద్యార్థులతో నడక ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి ర్యాలీని ప్రారంభించి ఎంఎస్‌ఆర్ సర్కిల్ మీదుగా దర్గా సర్కిల్ వరకు కొనసాగించారు. అక్కడ రోడ్డు భద్రతా సూచనలను పాటిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే, డీటీసీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ఏటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలకు విరుద్ధంగా ప్రజలు వాహనాలను నడపకూడదన్నారు. తప్ప తాగి రోడ్డుపై బండెక్కకూడదని తెలిపారు. ఈ కారణంగా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, బండి నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంతోపాటు రోడ్డు జాగ్రత్తలు పాటించడం మరిచిపోవద్దని పదే పదే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్‌కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, వాసుదేవారెడ్డి, శివారెడ్డి, మురళీ, శివకుమార్, ప్రసాద్‌వర్మ, శ్వేత, అధికారులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌తో కార్మికులకు సంక్షేమం

- భవన నిర్మాణ, అసంఘటితరంగ కార్మికులకు గుర్తింపు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఈ–శ్రమ్ పథకం శ్రామిక జనావళికి ఆసరాగా నిలుస్తోంది. వీటితో పాటు భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందజేసే గుర్తింపు కార్డుల ద్వారా వారు సంక్షేమ లబ్ధిని పొందనున్నారు. క్షేత్రస్థాయిలోని కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు కార్మికశాఖ విశేష కృషి చేస్తోంది.

ఇవీ ప్రయోజనాలు

కార్మికులకు గుర్తింపు కార్డును జారీ చేస్తారు. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత ఉంటుంది. కార్డు కలిగిన వారికి రూ.2 లక్షల ప్రమాదబీమా, పనిలో ఉండగా వైకల్యం కలిగితే లక్ష ఆర్థిక సాయం అందిస్తారు. విపత్తులు కాలంలో శ్రామికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారు. వృత్తి నైపుణాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈకార్డు ఎంతో ఉపకరిస్తుంది. అసంఘటితరంగ కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు నమోద అవసరం అలాగే నేరుగా లబ్ధిదారుని ఖాతాకు జమచేసే వీలుంటుంది.

నమోదు ఇలా

కార్మికులుడు ఈ–పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా వివరాలు నమోదు చేసి యూనివర్సల్ ఖాతా నంబరు గుర్తింపు కార్డును జారీచేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చు. కార్మికుని ఆధార్ కార్డు బ్యాంకు అకౌంటు వివరాలు చెప్పాల్సి ఉంటుంది. కార్మికుడు ఎవరి వద్ద పనిచేస్తున్నారో వెల్లడించాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నారో చెబితే సరిపోతుంది. ఈ–శ్రమ్ కార్డు ఒకసారి నమోదు చేసుకుంటే చాలు జీవితకాలం వర్తిస్తుంది. భవన నిర్మాణ, అసంఘటిత కార్మికులు 5 ఏళ్లకు ఒక సారి రెన్యూవల్ చేసుకోవాలి. రెండు కాన్పుల వరకు రూ.20 వేలు వరకు ఇస్తారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

జిల్లాలోని భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు ఈ–శ్రమ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విషయమై కార్మికులకు ఇప్పటికే తెలియజేశాం. ప్రతి ఒక కార్మికుడు తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

– ఓంకార్‌రావు, జిల్లా కార్మికశాఖాధికారి

అర్హులు వీరు

18–59 సంవత్సరాల నిర్మాణ వలస కార్మికులు, ఇంటిపనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, తోట పని, వడ్రంగి, ఉప్పు, ఇటుక బట్టీల కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, షాపుల్లో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేని వారు ఈ పథకానికి అర్హులు.



ఈ–శ్రమ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు (ఫైల్)

విస్తారంగా అంతర పంటల సాగు



మామిడితోటలో అంతర పంటగా మిరప



అంతరపంటగా సాగుచేసిన వేరుశనగ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులు మామిడి తోటల్లో మిరప, మినుము, వేరుశనగను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. మండలంలో 180 ఎకరాల్లో మామిడి తోటల్లో మిరప, మినుము, వేరుశనగ అంతర పంటలుగా సాగులో ఉన్నాయి. మామిడి తోటలకు వాడే నీటితోనే మిరప, మినుము, వేరుశెనగ పంటలను పండించ వచ్చని, పెట్టుబడి ఖర్చు తక్కువవుతందని, విద్యుత్ ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. పంటల దిగుబడి బాగా వస్తుందని, మిరప, మినుము, వేరుశెనగ పంటలకు వాడే ఎరువులు, నీటి వల్ల మామిడి చెట్లకు పోషకాలు అందుతాయి. మామిడి తోటల్లో ఐదు సంవత్సరాలు వరకు అంతర పంటలను సాగు చేసుకోవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

